# హరివిల్లు

రఘు ఆళ్ళ



హరివిల్లు
గుండె జల్లుగా మారితే
చిరుజల్లు చిలకరించి
చిక్కనైన చిద్విలాసం
పైట కట్టి
పరాగాల పరిమళాన్ని
మనపై విసిరితే
ఏమంటామ్?
సీతాకోక చిలుక
శీతల వేళ
సంధ్యామృతాన్ని
సుధలుగా
కథలుగా
కలలుగా
వాలిందనుకుంటాం!
అలాంటి సీతా చిలుకలు
కనురెప్పలపై వాలి
కనువిందు చేసి
రంగునలా పూసి పోతే,
ప్రాకృతిక సొబగులకు
ప్రాచీన సాంప్రదాయం
ప్రవల్లికలోలే అల్లిపోతే,
అరుణ కాంతుల అద్వితీయ భావం
అనిర్వచనీయమై,
గుండె సిరల్లోకి ఇంకిపోయి
కవితాత్మ నిండిన
కలంలోని సిరా గా జారితే,
కావ్య చిత్రమై - కమ్మటి విచిత్రమై
మెరవదా?
నిను కాంచిన - నా మనోముద్రితమై
మురవదా!!!!

★★★★



## పదాలంకారం
## వర్చస్వి

ఊహల ఉద్యానంలో
కేవలం భావరాగాలు ఉదయిస్తే చాలుతుందా!
ఎంచుకున్న పదాల గానం
గొంతు విచ్చుకునేలా కుసుమించాలి
భావాల బీజాలు
పైరు పచ్చటి కవిత్వంగా ఎదగాలనే
కవన కుతూహలానికి తోడు
అక్షరాల దుక్కి దున్నే కలం హలం పదును పెట్టాలి
మనసును కమ్మిన పలు మాలిన్యాల
ముసురులు విడిపోయేంతవరకూ అవిశ్రాంతంగా
మరో ఉషస్సుకోసం సాహితీ తపస్సు చేయాలి
అలా ప్రాప్తించిన పదాల్ని పొదువుకుని
అల్లి బిల్లి కావ్యమాలలల్లి
కవితా కన్నియ వాలు జళ్ళో తురమాలి
సాహితీ మహోద్యానాన
పదసౌరభాలతో సంపంగి పొదలా ఒదిగిపోవాలి...!

★★★

## మరికాస్త ఆస్వాదిస్తే..
## మరువం ఉష

పసిపాప చూసి నవ్వగానే
గుండెల్లో పక్షులు వాలినట్లుగా హాయి,
చిటారుకొమ్మల్లో పిట్టలేవో పాడుతుంటే
తోటల్లో పిల్లగాలులు ఆడుకున్నంత శాంతి,
వాగు మీద గాలి అలలు ఊగుతుంటే
ఒడ్డున నావలు నాట్యమాడినట్లు ఊహ,
నావలో తెరచాప రెపరెపలాడుతుంటే
ఆకసాన మబ్బులు ఎగిరినట్లు భ్రాంతి,
మేఘాలు కరిగి నేలని తాకుతుంటే
మట్టి బంతులు చేసి కానుకిచ్చిన మురిపెం,
తడిమట్టి మీద అడుగులు వేస్తుంటే
మనస్సు పసిపాపలా నవ్విన సత్యం,
అనుభవం భావనగా మలచుకుంటే
గమనం నుంచి సాగే అనుభూతిది నిత్య గమనం

★★★



# ఫలవృక్షానికి ఎరువయ్యేవాడు

స్వర్ణకుమారి

వాడు ఎన్నడూ కాలిక్యులేటెడ్ కాదు-
భూమిని.. 'అమ్మకడుపు'గా; 'విరి'యల్ ఎస్టేట్ గా మాత్రమే చూడగలడు-
బ'రియల్' ఎస్టేట్ గా, అమ్మకపు సరుకుగా  కొలిచి, వెల కట్టే లెక్కలు
వాడికి ఒకటో తరగతిలో ఆల్జీబ్రాలాంటివే!
వాడు ఎన్నడూ 'కాల'క్యులేటెడూ కాదు-
ఫిఫ్టీ ప్లస్ అయినా వాడి స్వరపేటికకు వృద్ధ పరిభాష ఓనమాలే తెలియవు!
ఫైవ్ బిలోలాగే వాడి మేనూ, మనసూ
గమక, తమక, మైకాలతో; మార్మిక విభ్రమలతో ఉక్కిరిబిక్కిరవుతుంటాయి!
విశ్వరహస్యదుర్గ విస్ఫోటానికి అక్షర క్షిపణులతో..
అనునిత్యం దాడి చేసే కరడుగట్టిన కవి వాడు!
శాలువాలంటే.. దీర్ఘచతురస్రాకారపు గొంగళిపురుగులు;
బిరుదులూ, కిరీటాలంటే..లోపలి దురదకు లోషన్లు.. అన్నది వాడి నిర్వచనం!
స్త్రీ అధరాలనూ, శిశువు పాదాలనూ వాడు
ఒకే గాఢానురక్తితో చుంబించి పరవశిస్తాడు!
ఆ రెండింటిలో దేవుని దయలాంటి మార్దవమూ,
అమృతం రుచిలాంటి మాధుర్యమూ పుష్కలమంటాడు!
ఓ పసిబిడ్డ తనను చూసి అయాచితంగా నవ్విన నాడు,
ఎవరైనా తనతో మనసు విప్పి ఒక్క ముక్క మాట్లాడిన నాడు-
ఆ రోజు పండగే అంటాడు!
తనకు ప్రతిరోజూ పెద్ద పండగే  అంటాడు!
బతుకంటే- కానరాని కాలం గుండెల్లో
ప్రేమ పరాగాన్ని నింపే జీ'వనమాలి' కొలువేనంటాడు!
వాడి పెరటి నేరేడుచెట్టు పళ్లంటే
ఊరి పసివాళ్లకు లొట్టలట..
తాను తనువు చాలించాకా..చితాభస్మాన్ని..
ఆ చెట్టుకు ఎరువుగా వెయ్యమన్నది వాడి వీలునామా!

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

నడచి నడచి యడుగు తడబడుచునుండె
ఎంత దూరమీవిధి పయనింపవలయు?
కలదె యీ దారి తుదనైన గమ్యమొకటి
కలదటంచును నా మది పలుకుచుండె

అలసిపోయితినిక ముందుకరుగలేను
తలను దాచుకొనగనొక్క నిలయమేది?
ఒక్క గూడైన యీ దారినున్నదేమొ
ఉన్నదని తోచునేలనో యూహయందు

సొలసి గమ్యాన కనునది శూన్య గృహమొ!
ఎందరో యింట తిరుగాడుచుందురేమొ!
తారసిల్లుదురేమొ నేస్తమ్ములచట!
విడచి యేగిన చెలియ కన్పించునేమొ!

తలుపు తట్టక వెలుపల నిలచి యుందు
నిలచి చూచుచునుందు సందియముతోడ
ఇంటిలోనికి పిలుతురా యెవ్వరైన
ఆత్మ నుడివెను దొరకునాహ్వానమంచు

అంతుపట్టని తుది నేడు చెంత నిలచె
ఇంతకాలము నడచినదిందుకొరకె
తెలియనేరని వింత కన్నులకు గట్టె
బ్రతుకు తీరాంతరము నేడు స్పష్టమయ్యె



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS